క్లుప్తంగా

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు మరో అవార్డు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గీసిన పల్లె పడతి అనే చిత్రానికి ఆర్ట్ లెజెండ్ గోల్డెన్ పద్మ అవార్డు లభించిందని జెస్టిస్ తెలిపారు. కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురం వారు 2023 సంవత్సరంలో సెప్టెంబరు నెలలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో జెస్టిస్ గీసిన చిత్రానికి ఈ అవార్డు వచ్చినట్లు పరిషత్ నిర్వాహకులు కొరసాల సీతారామస్వామి ప్రకటించారన్నారు. అవార్డును అందుకు వజ్రగిరి జెస్టిస్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు, కళాకారులు, కవులు, న్యాయవాదులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందించారు.

న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



వినుకొండ టౌన్: న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా కాకర్ల చిన్నదానం, కార్యదర్శిగా గుంజరి నరసింహారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవాద గుమస్తాల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా నిర్వహించిన ఎన్నికలో వారిరువురిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమస్తాల సంక్షేమ సంఘానికి కృషి చేస్తామన్నారు.

నిత్యాన్నదాన సత్రం కోశాధికారిగా రోశయ్య



వినుకొండ(నూజెండ్ల): శ్రీశైలంలో ఉన్న అఖిల భారత కుమ్మర శాలివాహన నిత్య అన్నదాన సత్రం కోశాధికారిగా వినుకొండ పట్టణానికి చెందిన బొంకూరి రోశయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీశైలంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రోశయ్య ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కోశాధికారిగా ఎన్నికైన బొంకూరి రోశయ్యను రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, కుమ్మరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, భాస్కర శ్రీనివాసులు తదితరులు అభినందించారు. సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని రోశయ్య తెలిపారు.

పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

నాదెండ్ల: గణపవరం హెచ్‌డబ్ల్యూ (ట్యాంక్ స్కూల్) ప్రాథమిక పాఠశాలను సోమవారం తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు సందర్శించారు. ఈ పాఠశాలకు ఆనుకుని ఓ పాగాకు పరిశ్రమ ఉన్న నేపథ్యంలో వేసవి, వర్షాకాలాల్లో దుమ్ము, ధూళితో పాటూ విపరీతమైన వాసన వెదజల్లుతుండటంతో స్థానికుల నుంచి ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో సోమవారం వీఆర్వో సాంబశివరావుతో కలిసి పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుంచి కానీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కానీ ఏమైనా ఫిర్యాదులున్నాయా అని ఆరా తీశారు. అయితే హెచ్‌ఎంగా ఉన్న ప్రసాదరావు సెలవులో ఉండటంతో ఉపాధ్యాయులు తమ హెచ్‌ఎం అందుబాటులో లేరని, ఎలాంటి సమస్యలు తమ దృష్టికి రాలేదని తెలిపారు. హెచ్‌ఎం విధుల్లో రాగానే సమస్యలను తెలియపరుస్తామని తెలిపారు.

నేడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు తుది గడువు

యడ్లపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయా పోస్టులకు దరఖాస్తులు పెట్టుకునేందుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి.శాంతకుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ యడ్లపాడు మండలం పరిధిలో మూడు అంగన్‌వాడీల్లో హెల్పర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. బోయపాలెం బీసీ సెంటర్, కొత్తసొలస ఎస్సీ సెంటర్, లింగారావుపాలెం బీసీ సెంటర్‌లో ఉన్న ఖాళీల భర్తీకై వివాహితులైన స్థానికులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకునే వారు కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణులై, 2023 జులై 1వ తేదీ నాటికి ఆమె వయస్సు 21–31 మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వారికి 18 ఏళ్లు నిండిన వారిని పరిగణంలోని తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈనెల 31 సాయంత్రం 5 గంటలలోపుగా తమ అర్జీలను నాదెండ్ల ఐసీడీఎస్ కార్యాలయంలో నేరుగా అందించాలన్నారు.

జగనన్న పాలనలో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతుందని ప్రభుత్వం తమదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని 27వ వార్డులోని క్రిస్టియన్ పాలెం నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలని అన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్‌ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పను లు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో అన్నివర్గాలను ఆదుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వార్డు కౌన్సిలర్ కిన్నెర హేమలత, వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్‌ఖన్నా, బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, గంటా కాలేషా, నంది నరసింహారావు, పాపసాని బ్రహ్మయ్య, ఎం.ఎల్.రెడ్డి, కల్యాణ్, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, జడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో చిరుమామిళ్ల విద్యార్థిని సత్తా

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టులో స్థానం



బాదినేడి నాగతేజస్విని

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బాదినేడి నాగతేజస్విని రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్ 14 విభాగంలో సత్తా చాటింది. నాగతేజస్విని ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 27న తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్‌పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో పాల్గొని సత్తా చాటింది. మంచి ఆటతీరు కనబరచిన నాగతేజస్విని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఆడనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

పసుమర్రులో...



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. పసుమర్రులోని ఎస్‌ఎంకే జెడ్పీహైస్కూల్ విద్యార్థులు బాల్‌బాడ్మింటన్ అండర్–17లో ఈమని అమృత, అండర్–14లో షేక్ పర్వీన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు నవంబర్ 4,5 తేదీలలో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారు. ఈ విద్యార్థులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్ వలి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యర్రం వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ తన్నీరు నాగవర్ధిని, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దే హరిబాబు, గోపాళం మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరింది నాలుగు కుటుంబాలే



మాట్లాడుతున్న మేకల మురళీమోహనరావు, పక్కన నరసింహారావు

నరసరావుపేట రూరల్: పెట్లూరివారిపాలెం గ్రామం నుంచి టీడీపీలో వంద కుటుంబాలు చేరినట్లు ఆపార్టీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని గ్రామ సర్పంచ్ మేకల మురళీమోహన రావు, ఉపసర్పంచ్ తుమ్మలపూడి నరసింహారావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయని తెలిపారు. నాలుగు కుటుంబాలకు తొమ్మిది ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు.

ఎల్లో మీడియా, టీడీపీ వంద కుటుంబాలు చేరినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. పెట్లూరివారిపాలెం టీడీపీకి కంచుకోట అని టీడీపీ నాయకులు చేప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2014ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి 450 ఓట్లు మెజార్టీ వచ్చిందని, 2019 ఎన్నికల్లో మెజార్టీ పెరిగి 563 ఓట్లు వచ్చాయని వివరించారు. అవాస్తవాలతో ప్రజలను పక్కదారి పట్టించడం టీడీపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. టీడీపీ చేస్తున్న మోసపూరిత ప్రకటలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వారికి మరోసారి బుద్ధి చెబుతారని తెలిపారు.

కరాటే నేషనల్ చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అనుముల రాంబాబు, రామయ్య

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా, మంగళగిరిలోని ఈద్గా షాదీఖానాలో కరాటే ఇన్విటేషనల్ నేషనల్ చాంపియన్‌షిప్ 29న నిర్వహించారు. ఈ టోర్నమెంటులో సత్తెనపల్లికి చెందిన షీకోకాయ్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు 12 మంది ప్రతిభ చూపారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో ఎస్.ఎస్.ఎస్. అక్షర(గోల్డ్ మెడల్), ఎస్. శరణ్య (గోల్డ్ మెడల్), టి.నిఖిత (సిల్వర్ మెడల్), బి.అక్షయ (బ్రాంజ్ మెడల్), వ్యక్తిగత బాలుర కటా విభాగంలో ఎల్. కిరీట్ (గోల్డ్ మెడల్), టి.అఖిల్ (గోల్డ్ మెడల్), ఎస్.సాయిరాం రెడ్డి (సిల్వర్ మెడల్), కె.టి.ప్రకాష్ (సిల్వర్ మెడల్), ఎల్.గేష్టఆషిత్ (బ్రాంజ్ మెడల్), ఎస్. కె.ఇదయతుల్లా (బ్రాంజ్ మెడల్), బి.సత్య నారాయణ (బ్రాంజ్ మెడల్), ఎ.పవన్‌చౌదయ్య (బ్రాంజ్ మెడల్)లు సాధించిన విద్యార్థులను సెన్‌సాయ్ అనుముల రాంబాబు, షిహాన్‌అనుముల రామయ్యలు సోమవారం అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దమ్మాలపాడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఎరువుల దుకాణాల్లో నిల్వ వివరాలను అందరికీ కనిపించేలా అందుబాటులో నోటీసు బోర్డుపై ఉంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే సంబంధిత దుకాణ లైసెన్స్ రద్దు చేయటంతో పాటు దుకాణదారునిపై చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసు బోర్డులో స్టాక్‌తో పాటు ధరల వివరాలు కూడా ఉంచాలని సూచించారు. సీజన్‌కు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ బిల్లు అందించాలన్నారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆమెతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు

నకరికల్లు: స్థానిక గంగమ్మతల్లి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు ఉచిత భిక్ష ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం భిక్ష ఏర్పాట్లలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నకరికల్లు గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని పలువురు మాలధారులు భిక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రోజుకు సుమారు 150 నుంచి 200 మంది అయ్యప్పలు భిక్షకు హాజరవుతున్నారని భక్తసంఘం వారు తెలిపారు. మాలధారులు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు. సోమవారం మామిడిశెట్టి సుబ్బారావు కుటుంబసభ్యులు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీటి సమస్యకు పరిష్కారం

బొల్లాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించామని గ్రామీణ నీటి సరఫరా ఏఈ పి. సురేష్ తెలిపారు. వర్షాభావంతో పలు గ్రామాల్లో బోర్లల్లో నీటి మట్టంతగ్గడంతో నీటి కొరత కొంత మేరకు ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కొన్ని గ్రామాల్లో కొత్త బోర్లు మోటార్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ నిధులతో ఆయా గ్రామాలతో నూతన బోర్లు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మార్చి ఏప్రియల్, మే, జూన్ నాలుగు నెలల కాలంలో నెలకొన్న నీటి సమస్యకు ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా నీటి సరఫరాతో గ్రామాలకు తాగునీరు అందించామన్నారు. ప్రస్తుతం మండలంలోని గండిగనుమలలో 20హార్స్‌పవర్ మోటరు ఏర్పాటు చేశామని, గుమ్మనంపాడు, రేమిడిచర్ల, అయ్యన్నపాలెం, హనుమాపురం, వెంకట రెడ్డిపురం, రావులాపురం గ్రామాలు, తండాల్లో నీటి కొరత లేకుండా బోరు, మోటర్లు ఏర్పాటు చేసి నీటి పరష్కారానికి కొంత మేర పరిష్కారం చూపామని ఏఈ తెలిపారు.

8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేట: కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నవంబరు 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి యువజన నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్జి, ఏపీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వేముల శ్రీనివాస్ మాట్లాడారు. సుమారు 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతుందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పురోగతి వేగవంతం చేయాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అన్నీ గ్రామాల్లోని వలంటీర్లు సంయుక్తంగా మొబైల్ యాప్ ఆరోగ్యశ్రీ కార్డు కల్గియున్న ప్రతి ఇంటిలోని వారందరు సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్డు కల్గిన కుటుంబ సభ్యులకు భారతదేశంలో ఏరాష్ట్రంలోనైనా రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు.

అలాగే కార్డు కల్గియున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులచే ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు. అనంతరం గ్రామసచివాలయ వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు.

నూతన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ చేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో 32 వేల 736 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 16 వేల 134 మంది మహిళలు–16 వేల 601 మంది ట్రాన్స్‌జండరు–1 ఉన్నట్లు చెప్పారు. డిసెంబరు 9వ తేదీలోగా ఎమైనా అభ్యంతరాలు చేర్పులు, మార్పులు ఉన్నఎడల సమగ్ర ఆధారాలతో లిఖిత పూర్వకంగా సంబంధిత పోలింగ్ కేంద్రం బీఎల్‌వో, తహసీల్దారు కార్యాలయం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హత కల్గియున్న వారందరికీ సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాల నిండిన వారందరు ఓటుహక్కు కల్పిస్తామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పి.నాసరయ్య తదితరులు ఉన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో నవంబరు 7వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు గారి కల్యాణమండపంలో నియోజకవర్గస్థాయి ముఖ్యనాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయటం మన బాధ్యతగా భావించి, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు యాత్రలో పాల్గొనేలా నాయకులు తగినచర్యలు తీసుకోవాలని కోరారు. నూజెండ్ల మండలం ముప్పరాజు వారిపాలెం గ్రామం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి నూజెండ్ల మీదుగా సాయంత్రం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటుందని, అనంతరం పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రివర్గంలోని అన్ని శాఖల మంత్రులు అందరూ పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగాలు చేస్తారని తెలిపారు. అన్ని మండలాల నాయకులు అందరూ ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఈ కార్యక్రమంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తల బలంను చూపించాలని, మన పల్నాడు నుంచి భారీ ఎత్తున ఘన స్వాగతం పలికేవిధంగా మనం ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

మట్టి ఖర్చుల నగదు అందజేత



మృతుని కుటుంబానికి నగదు అందజేస్తున్న గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి



మృతుని భార్య ఝాన్సీకి మట్టి ఖర్చుల నిమిత్తం నగదు అందిస్తున్న కౌన్సిలర్ సాగర్‌బాబు

నాదెండ్ల: గుండెపోటుతో మృతి చెందిన మృతుడి కుటుంబానికి గణపవరం సచివాలయ సిబ్బంది మట్టిఖర్చుల నిమిత్తం సోమవారం నగదు అందించారు. గణపవరం గ్రామానికి చెందిన మేరిగ సుజనారావు (33) ఈ నెల 22న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ఇరువురు మగ సంతానం కాగా, భార్య ఝాన్సీ, తల్లి ఉన్నారు. వైఎస్సార్ బీమాలో నమోదైయుండటంతో మృతుని కుటుంబానికి మట్టిఖర్చుల నిమిత్తం భార్య ఝాన్సీకి రూ.10 వేలను పంచాయతీ కార్యదర్శి కె కవిత, మూడో వార్డు కౌన్సిలర్ పిల్లి సాగర్‌బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాజావలీజర్ అందించారు. త్వరలో మృతుని కుటుంబానికి రూ.90 వేలు బ్యాంకు ఖాతాకు జమ కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్ లాల్‌బీ, స్థానిక వైసీపీ నాయకులు గొడుగు ఆంజనేయులు ఉన్నారు.

వి.రెడ్డిపాలెంలో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పడిగపాటి వెంకటరెడ్డి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల రూపాయల నగదును సోమవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ బత్తుల నాగమ్మ, కసిరెడ్డి వెంకట కోటిరెడ్డి తదితరులు ఈ మొత్తాన్ని అందజేసి వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. మిగిలిన మొత్తాన్ని కూడా ప్రభుత్వం నుంచి త్వరలో ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనలు మేరకు వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కల్గిఉండాలని నరసరావుపేట డివిజన్ బ్రేక్ ఇన్‌స్పెక్టరు బి.సత్యనారాయణ ప్రసాదు అన్నారు. సోమవారం పట్టణంలో కారంపూడి రహదారి మార్గంలో రవాణా శాఖాధికారులు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణ ప్రసాదు మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాలు మేరకు ఆర్టీసీ ఆధాయానికి పెంపుదలకు ప్రవేటు వాహనాలు నియంత్రణకు తనిఖీలు చేశామన్నారు. అందులో భాగంగా 07 వాహనాలు తనిఖీలు చేయగా రూ. 40 వేలు ఆదరాధ రుసుం విధించామన్నారు. ఆయనతో పాటు డిపో మేనేజరు యం. కోటేశ్వరనాయక్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

యడ్లపాడు: గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మండలంలోని సొలస గ్రామానికి చెందిన పేరం కోటేశ్వరమ్మ కొంతకాలంలో మధుమేహం, మూత్రపిండాల వంటి పలు వ్యాధులతో బాధపడుతోంది. అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 28న ఆమె ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు చిన్న వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నలుగురికి జైలు శిక్ష

శావల్యాపురం: భార్య భర్తలపై దాడికి పాల్పడిన సంఘటనలో కోర్టులో నేరం రుజువు కావటంతో నలుగురికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ. 3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఎస్సై తుమ్మూరి తిరుపతి రావు వివ రాల మేరకు.. మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన వెలమవారిపాలెం గ్రామానికి చెందిన వంగా వెంకటేశ్వర రావు, వంగా హనుమంతరావు, వంగా కోటేశ్వరరావు, వంగా చిన వెంకటేశ్వర్లు అను వ్యక్తులు అదే గ్రామానికి చెందిన అమరవరపు తిరుపతిరావు అతని భార్య ధనలక్ష్మిలు స్థల వివాదంలో భార్యభర్తలను కర్రల తో కొ ట్టి గాయపరిచింది. ఈ సంఘటనలో అప్పటి ఎస్సై ఆర్ ఉమేష్ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి చార్జీషిట్ దాఖలు చేయగా కేసు విచారణలో నేరం నిరూపణ కావటంతో వినుకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి (న్యాయమూర్తి) యు. రామమోహన్ జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. ఇందులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండే వెంకటేశ్వర్లు కేసును వాదించగా కోర్టు కానిస్టేబుల్ బి.శివనాగరాజులు సహాయ సహకారాలు అందించారన్నారు.

నలుగురు గేదెల దొంగలు అరెస్ట్



వినుకొండ(నూజెండ్ల): గేదెలను దొంగతనం చేస్తున్న నలుగురు వ్యక్తులను ఐనవోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఐనవోలు ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కథనం ప్రకారం... కంభంపాటి ప్రభుదాసు (కొత్త త్రిపురాపురం), మందా వెంకయ్య (మతుకుమల్లి), కాకాని కోటయ్య (కంభంపాడు), కడియం కోటయ్య (మూగచింతలపాలెం)లు గేదెల దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరు వినుకొండ, నూజెండ్ల మండలాల్లో 4 గేదెలను దొంగతనం చేశారని, వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను ఈ నెల 29వ తేదీన వినుకొండ మండలంలోని మదమంచిపాడు టెంపుల్ వద్ద అరెస్ట్ చేసి వినుకొండ కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు



నరసరావుపేట రూరల్: వ్యవసాయ అధికారులు సోమ వారం పట్టణంలోని పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. అనధికార పురుగుమందులపై వచ్చిన సమచారం మేరకు తనిఖీలు చేసినట్లు ఆమె తెలిపారు. అనధికార పురుగు కొనుగోలు చేయడం, విక్రయించడం నేరమని తెలిపారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో తప్పనిసరిగా ఇన్‌వాయిస్ బిల్లులు కలిగి ఉండాలని సూచించారు. ఇన్‌వాయిస్ లేకుండా పురుగు మందులు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.